# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం - 7- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 64 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


## రహదారి పనులన్నీ ఒకే వ్యవస్థ పరిధిలోకి రావాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు రహదారి నెట్‌వర్క్‌కు సంబంధించిన అన్ని పనులను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, హెచ్‌ఎండీఏ పరిధిలో రహదారి విస్తరణ పనులు, వాటి పురోగతిపై ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

సమావేశంలో హెచ్‌ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు. భూసేకరణ, నిధుల సమీకరణ, నిర్వహణతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, నగరంలోని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఇతర ప్రధాన రహదారులన్నింటినీ ఒకే వ్యవస్థ కింద సమన్వయం చేయాలని సూచించారు.

మిగతా 2లో

## ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డులు

- సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో పంపిణీ
- డెబిట్ కార్డు తరహాలో కొత్త రూపకల్పన
- బార్‌కోడ్‌తో ఆన్‌లైన్ వివరాల సౌకర్యం

2లో





## సచివాలయంలో ఘనంగా బోనాల వేడుకలు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రధాన కార్యదర్శి
- నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు
- భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించిన ఉద్యోగులు
- తెలంగాణ ప్రజలకు బోనాల శుభాకాంక్షలు



హైదరాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొని ప్ర త్యే క పూజలు నిర్వహించి అమ్మ వారి ఆశీస్సులు పొందారు. సచివాలయ ప్రాంగణంలోని శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలు, శాంతి, ఆయురారోగ్యాలు, సుభిక్షాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. రాష్ట్ర అభివృద్ధి నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తి పారవశ్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో

మిగతా 2లో



## బొగ్గు శాఖ పనితీరుపై సమీక్ష

- కేంద్ర మంత్రి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం
- బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై సమీక్ష
- కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం
- ఇంధన భద్రతకు కార్యాచరణపై చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):

కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి గురువారం న్యూఢిల్లీలో బొగ్గు మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, సరఫరా, కార్మికుల సంక్షేమం, దేశ ఇంధన అవసరాల భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి, వివిధ ప్రాంతాలకు సరఫరా ప్రక్రియను మంత్రి సమీక్షించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక అవసరాలకు ఎలాంటి అంతరాయం లేకుండా బొగ్గు నిల్వలు, సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

మిగతా 2లో

## 216 మంది పోలీసులకు సీపీ ప్రశంసలు

- రివార్డ్ మేళాలో ప్రతిభావంతుల సత్కారం
- నేర నియంత్రణలో విశేష సేవలకు గుర్తింపు
- సాంకేతికత వినియోగంపై సీపీ దిశానిర్దేశం
- ప్రజలకు మెరుగైన సేవలందించాలని పిలుపు

సైబరాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):

నేరాల నియంత్రణ, నేరాల ఛేదన, శాంతిభద్రతల పరిరక్షణలో విశేష ప్రతిభ కనబరిచిన 216 మంది పోలీసు సిబ్బందిని సైబరాబాద్ పోలీసు కమిషనర్ డా. ఎం. రమేష్ ఘనంగా సత్కరించారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన రివార్డ్ మేళా కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు, పురస్కారాలను అందజేసి వారి సేవలను అభినందించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

మిగతా 2లో



## సామాజిక న్యాయ పోరాటమే లక్ష్యం



- సంకల్ప సభలో కవిత కీలక ప్రకటనలు
- బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్
- బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ఆమోదించాలన్న హెచ్చరిక
- లేదంటే వెయ్యి కార్లతో ఛలో ఢిల్లీ చేపడతామని స్పష్టం

హైదరాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ కు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సంకల్ప సభ దేశంలోని కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చే ఉద్యమానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. కవిత మాట్లాడుతూ, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లును వచ్చే బడ్జెట్ సమావేశాల్లోపు ఆమోదించి ముందుకు తీసుకురావాలని కోరారు. అలా జరగకపోతే వెయ్యి కార్లతో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సామాజిక న్యాయం కోసం రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

తాను బీసీల హక్కుల గురించి మాట్లాడితే తనపై విమర్శలు చేస్తున్నారని, అయితే తన పుట్టుక తన చేతిలో లేకపోయినా ఎవరి కోసం పని చేయాలనే నిర్ణయం మాత్రం తనదేనని కవిత వ్యాఖ్యానించారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేస్తున్నానని చెప్పారు. కుల వివక్షను పూర్తిగా నిర్మూలించేందుకు మరో దశ ఉద్యమం అవసరమని, తెలంగాణ సాధించినట్లే సామాజిక తెలంగాణను కూడా సాధించాలని పిలుపునిచ్చారు. దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ముస్లింలు, మహిళలు, ఆదివాసీలు, ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులు సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ప్రజల్లోకి కాక్రోచ్ జనతా పార్టీ..

## దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' ప్రచార యాత్ర

**ఢిల్లీ, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఇక ప్రజా సమస్యలపై ప్రత్యక్షంగా అవగాహన పెంపొందించుకునేందుకు దేశవ్యాప్త ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన పార్టీ కోర్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే నెల నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్' పేరుతో దేశవ్యాప్తంగా ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను తెలుసుకునే ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

దేశంలో పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లలో విద్యా ఫీజులు విపరీతంగా పెరగడంతో సామాన్య కుటుంబాలకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో మొదటి తరగతి ప్రవేశానికే లక్షల రూపాయల ఫీజులతో పాటు విరాళాల పేరుతో అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. పిల్లల విద్య, ఉన్నత విద్య, కోచింగ్ ఫీజుల కోసం అనేక కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని పేర్కొన్న ఆయన, తల్లిదండ్రులను ఈ ఆర్థిక భారం నుంచి విముక్తి చేయడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రజల అభిప్రాయాలను సేకరించి, వాటి ఆధారంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని అభిజీత్ దీప్కే తెలిపారు.

### ప్రెజర్ గ్రూప్‌గానే కొనసాగనున్న సీజేపీ

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)ని రాజకీయ పార్టీగా మార్చే ఆలోచన తమకు లేదని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అభిజీత్ దీప్కే మరోసారి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో జవాబుదారీతనాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా సీజేపీ బలమైన ప్రజా ఒత్తిడి వేదిక (పబ్లిక్ ప్రెజర్ గ్రూప్)గానే కొనసాగుతుందని తెలిపారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, సంప్రదాయ రాజకీయాలపై ప్రజల్లో తీవ్ర నిరాశ నెలకొందని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యవస్థలను ప్రశ్నించే బలమైన పౌర ఉద్యమాన్ని నిర్మించడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని సమీక్షించిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రాజకీయ వ్యవస్థ, న్యాయవ్యవస్థ, మీడియా, ఎన్నికల సంఘం సహా పలు సంస్థలపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. జార్ఖండ్‌లో పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న విద్యార్థులకు సీజేపీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే పార్టీ ప్రతినిధి బృందాన్ని జార్ఖండ్‌కు పంపించి విద్యార్థులకు అండగా నిలుస్తామని అభిజీత్ దీప్కే వెల్లడించారు.

# 216 మంది పోలీసులకు సీపీ ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)





నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేసిన అధికారులు, సిబ్బంది సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఇలాంటి గుర్తింపు పోలీసు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు. ఆస్తులకు సంబంధించిన నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల విశ్లేషణ, డిజిటల్ దర్యాప్తు సాధనాలను సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. నిరంతర శిక్షణ ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి అధికారి సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని కమిషనర్ పేర్కొన్నారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా దర్యాప్తు విధానాలను కూడా ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు. రివార్డ్ మేళా కార్యక్రమంలో పరిపాలన డీసీపీ టి. అన్నపూర్ణ, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, క్రైమ్స్/ఈఓడబ్ల్యూ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి, ఎస్‌వోటీ డీసీపీ శోభన్ కుమార్, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సత్కారం అందుకున్న పోలీసు సిబ్బందికి కమిషనర్ అభినందనలు తెలియజేస్తూ, ఇదే స్ఫూర్తితో ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా సమర్థవంతమైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. నేరాల నియంత్రణలో సైబరాబాద్ పోలీసు శాఖ మరింత మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి కొనసాగించాలని సూచించారు.

# సామాజిక న్యాయ పోరాటమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ఆదివాసీలకు అడవులపై పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పలు తీర్మానాలను సభ ఆమోదించింది. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టడం, మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులకు భారతరత్న ఇవ్వడం, ప్రొఫెసర్ జయశంకర్‌కు పద్మవిభూషణ్ ప్రకటించాలని కేంద్రాన్ని కోరడం, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం, ఎస్సీ, ఎస్టీ నిధులను ఆయా వర్గాల అభ్యున్నతికే వినియోగించడం వంటి తీర్మానాలను ప్రకటించారు. సామాజిక న్యాయ ఉద్యమాన్ని సావిత్రిబాయి పూలే జయంతి వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామానికి తీసుకెళ్తామని కవిత వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ జయశంకర్ చెప్పిన సామాజిక తెలంగాణ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు అందరూ ఏకమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.






# రహదారి పనులన్నీ ఒకే వ్యవస్థ పరిధిలోకి రావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఔటర్ రింగ్ రోడ్డుపై నిర్వహణ లోపాలు, ఎక్కడికక్కడ వాహనాల పార్కింగ్ కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ, ఓఆర్ఆర్ నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, కొంగర కలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు నిర్మిస్తున్న రేడియల్ రోడ్-1ను డిసెంబర్ 9 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిర్మాణంలో ఎదురయ్యే అడ్డంకులను వెంటనే తొలగించి, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని స్పష్టం చేశారు. రోడ్లకు ఇరువైపులా విస్తృతంగా పచ్చదనం పెంపొందించే చర్యలు చేపట్టాలని, బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ నిర్మాణం, బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధి రహదారి విస్తరణపై ఆధారపడి ఉందని పేర్కొన్న ముఖ్యమంత్రి, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ల్యాండ్ పూలింగ్‌లో మధ్యవర్తుల జోక్యానికి అవకాశం లేకుండా చూడాలని ఆదేశించారు. టీడీఆర్‌ల జారీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కూడా సూచించారు.

# ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డులు



**హైదరాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపికబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ షెడ్యూల్‌కు ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదం తెలిపారని చెప్పారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు.

జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. అర్హుల తుది జాబితాలను సిద్ధం చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో ఉండనున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డులతో పోలిస్తే ఇవి మరింత సౌకర్యవంతంగా ఉండటంతో పాటు దీర్ఘకాలం మన్నికగా ఉండేలా రూపొందించారు.

కొత్త కార్డులపై కుటుంబ సభ్యుల పేర్లు, ఫొటోలు ముద్రించకుండా ప్రత్యేక గుర్తింపు సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉండనుంది. బార్‌కోడ్‌ను స్కాన్ చేస్తే లబ్ధిదారుల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. దీంతో సేవల నిర్వహణ మరింత పారదర్శకంగా, సులభంగా మారనుంది. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. సాంకేతికత ఆధారంగా రూపొందించిన ఈ కొత్త రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాల అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# సచివాలయంలో ఘనంగా బోనాల వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)



అధికారులు, ఉద్యోగులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ కళారూపాలు, రంగురంగుల వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సచివాలయ ప్రాంగణం అంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది.

ఈ సందర్భంగా సంజయ్ జాజు రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణలో శాంతి, సుభిక్షం, ఆనందం నెలకొని రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ వేడుకలు ఉద్యోగుల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

# బొగ్గు శాఖ పనితీరుపై సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)




బొగ్గు రంగ కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రజాకేంద్రిత కార్యక్రమాల పురోగతిని కూడా సమావేశంలో పరిశీలించారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

బొగ్గు గనుల నిర్వహణలో ఆధునిక సాంకేతికత వినియోగం, ఉత్పాదకత పెంపు, నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటి అంశాలపై కూడా చర్చించారు. బొగ్గు రంగంలో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. దేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసేందుకు బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందేలా బొగ్గు ఉత్పత్తి, పంపిణీలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బొగ్గు రంగ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# 996వ రోజుకు చేరిన లయన్స్ క్లబ్ ఉచిత అల్పాహార పంపిణీ

- -సుమారు 180 మందికి అల్పాహారం పంపిణీ.
- -మరో నాలుగు రోజుల్లో వెయ్యో రోజుకు సేవా కార్యక్రమం.



**సత్తుపల్లి, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి, బస్టాండ్ రింగ్ సెంటర్‌లలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార పంపిణీ కార్యక్రమం గురువారం 996వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సుమారు 180 మంది నిరుపేదలు, రోగుల సహాయకులు, ప్రయాణికులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దాసరి ఉమామహేశ్వర్ రెడ్డి, ఫుడ్ ప్రోగ్రాం చైర్మన్ గోగడ రవికుమార్, సన్‌రైజ్ క్లబ్ కార్యదర్శి దాసిరెడ్డి రాణి ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా గోగడ రవికుమార్ మాట్లాడుతూ, సేవే పరమావధి అనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం 996 రోజులుగా నిరంతరాయంగా కొనసాగుతుండటం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. ప్రతిరోజూ దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకు వచ్చి సహకరిస్తుండటం అభినందనీయమన్నారు. మరో నాలుగు రోజుల్లో వెయ్యో రోజుకు చేరుకోనున్న ఈ సేవా కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఊటుకూరి పుల్లారావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు ఊటుకూరి నాగేశ్వరరావు, రవికుమార్ దాతలుగా వ్యవహరించగా, షేక్ మయాన్ పుట్టినరోజు సందర్భంగా వారి తాత డాక్టర్ షేక్ వలి కుటుంబ సభ్యులు అల్పాహార పంపిణీకి సహకరించారు. లయన్స్ క్లబ్ చేపడుతున్న ఈ నిరంతర సేవా కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు, సేవా సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అభినందించారు. కార్యక్రమంలో గుడిమెట్ల గుప్త, డాక్టర్ షేక్ వలి, మీద్దె శ్రీను, చవ్వ సన్నీ, ఎస్‌డీ సలీం, దాసిరెడ్డి చిట్టిబాబు రాణి తదితరులు పాల్గొన్నారు.




# సరూర్ నగర్‌కు భారీగా తరలివెళ్లిన తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలు

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా

**జవహర్ నగర్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):** జవహర్ నగర్ నుండి సరూర్‌నగర్ కు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన "చలో సరూర్‌నగర్" మహాసభకు హాజరయ్యేందుకు జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నుంచి తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరారు. ఈ సందర్భంగా జెంగిలీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన బృందం ఉత్సాహంగా సరూర్‌నగర్‌కు తరలివెళ్లింది. తెలంగాణ పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ మహాసభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభ విజయవంతానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. "తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం ప్రజలందరూ ఏకమై ముందుకు రావాలి" అని నాయకులు పేర్కొన్నారు.




# నేరేడ్మెట్ వాజ్పేయి నగర్‌లో ఆర్‌యూబీ పనులకు శ్రీకారం

- ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీజేపీ నేతలు

**నేరేడ్మెట్, ఆగస్టు 6. (తెలంగాణ ముచ్చట్లు):**

నేరేడ్మెట్‌లోని వాజ్పేయి నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి (అర్ బీ యూ) నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బీజేపీ శ్రేణులు పాల్గొని మిఠాయిలు పంచుతూ, టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దశాబ్దాలుగా రైల్వే అండర్ బ్రిడ్జి లేకపోవడంతో రైల్వే గేట్లు తరచూ మూసివేయబడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరలేదని, అయితే మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ చొరవతో కేంద్ర రైల్వే శాఖ సుమారు రూ.75 కోట్ల వ్యయంతో ఆర్‌యూబీ నిర్మాణ పనులను ప్రారంభించిందని పేర్కొన్నారు.

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభం కావడం పట్ల స్థానికులు, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ప్రాజెక్టు పూర్తయితే వేలాది మంది ప్రజలకు ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తాడూరు శ్రీనివాస్, అంజలీదేవి, మాజీ కార్పొరేటర్లు సునీత యాదవ్, శ్రవణ్, ప్రసన్న కుమారి, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లి–శిశు ఆరోగ్యానికి తల్లిపాలే ఉత్తమం

- -ముల్కనూర్‌లో తల్లిపాల వారోత్సవాలు

**భీమదేవరపల్లి, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**



మండలంలోని ముల్కనూర్ అంగన్‌వాడీ 6వ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. తల్లిపాలు చిన్నారులకు సహజ రోగనిరోధక శక్తిని అందిస్తాయని, జననం నుంచి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఈ కాలంలో ఇతర ఎలాంటి ఆహార పదార్థాలు ఇవ్వకూడదని చెప్పారు. తల్లులు పోషకాహార విలువలను తెలుసుకుని సమతుల ఆహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే తల్లి, బిడ్డ ఆరోగ్య రక్షణ కోసం వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గోరింటాకు కార్యక్రమాలను నిర్వహించి, యూనిఫాంలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి, సీడీపీఓ స్వరూప రాణి, సూపర్వైజర్ పారిజాత, వార్డు సభ్యులు సుంచు చంద్రమౌళి, నాయకులు నరేందర్ గౌడ్, వైద్యశాఖ సూపర్వైజర్ రత్నప్రభ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సుధారాణి, ఏఎన్ఎం కళ, అంగన్‌వాడీ టీచర్లు రజిత, లలిత, శోభ, రాధిక, రాధ, సరోజన, రమాదేవి, నిర్మల, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

- అడ్డాకులలో ఘనంగా తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ 92వ జయంతి వేడుకలు

**అడ్డాకుల,ఆగస్టు06(తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి సందర్భంగా గురువారం మహబూబ్నగర్ జిల్లా అడ్డాకుల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవితాంతం అవిశ్రాంతంగా కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా చాటి చెప్పడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తొలి దశ, మలిదశ తెలంగాణ ఉద్యమాలకు మార్గదర్శకుడిగా నిలిచి, నీళ్లు-నిధులు-నియామకాల సాధన కోసం నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఒక్కటే లక్ష్యంగా రాష్ట్ర భావజాలాన్ని ప్రతి ఇంటికీ చేర్చేందుకు జయశంకర్ సార్ అంకితభావంతో పనిచేశారని తెలిపారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రజల్లో బలంగా నాటుతూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన మహనీయుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన త్యాగాలు, సేవలు, దృఢ సంకల్పాన్ని తెలంగాణ ప్రజానీకం ఎన్నటికీ మరచిపోదని అన్నారు. జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అడ్డాకుల మండల అధ్యక్షులు టి. శ్రీనివాస్ రెడ్డి, మండల సింగిల్ విండో చైర్మన్ మద్దూరి జితేందర్ రెడ్డి, పొన్నకల్ గ్రామ సర్పంచ్ మహిముద్దీన్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖాజా గోరి, మండల యూత్ అధ్యక్షుడు ఎలుసరి బాలరాజు, తిమ్మాయిపల్లి తండా సర్పంచ్ రవి నాయక్, నాయకులు దేవేందర్ రెడ్డి, వాకిటి శ్రీనివాసులు, రమేష్ గౌడ్, మహేష్ యాదవ్, ఎలుసరి శ్రీనివాసులు, వార్డు సభ్యులు శ్రీనివాసులు, నరేందర్, చంద్రకాంత్, కృష్ణయ్య యాదవ్, పండ్ల వెంకటేష్, మునగల రమేష్, భాస్కర్ గౌడ్, రెడ్యా నాయక్, ఆంజనేయులు, గట్టన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు యువతకు ఆదర్శం

- – పలుస శంకర్ గౌడ్, జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు

**వనపర్తి,ఆగస్టు06(తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని గురువారం వనపర్తి పట్టణంలోని తిరుమల హిల్స్‌లో గల రేడియంట్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు, విలువలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపల్ ఉప్పరి తిరుమలేష్ మాట్లాడుతూ.. మహనీయుల జీవితాలను అధ్యయనం చేసి వారి సేవా భావాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవకు అంకితమవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపల్ బి. రాము మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.అనంతరం విద్యార్థులకు తెలంగాణ ఉద్యమ చరిత్ర, ప్రొఫెసర్ జయశంకర్ పోషించిన పాత్ర, ఆయన సేవల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాహుల్, శాంతయ్య, రవి, శ్రీనివాస్, అఖిల్, మల్లేష్, ఖదిరున్నిసా, రామేశ్వరి, గీతా, రజిత, శ్వేత, సరోజ, సాత్విక, జరీనా తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్‌లో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**ఆగస్టు 6. (తెలంగాణ ముచ్చట్లు):**



జవహర్ నగర్ మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్‌లో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను సంఘం అధ్యక్షుడు మారోజు సోమాచారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ బింగి లావణ్య సతీష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్‌ను తెలంగాణ జాతిపితగా అధికారికంగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు మారోజు సోమాచారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దం పూర్తవుతున్నప్పటికీ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని అన్నారు. ప్రస్తుతం ట్యాంక్‌బండ్‌పై ఆంధ్ర ప్రాంతానికి చెందిన అమరవీరులు, మహనీయులు, కవుల విగ్రహాలు ఉన్నాయని, తెలంగాణ కోసం విశేషంగా కృషి చేసిన మహనీయుల విగ్రహాలకు కూడా అక్కడ స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణ మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, లేకపోతే బీసీ సమాజం తమ నిరసనను ఉధృతం చేస్తుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక గౌరవ సలహాదారులు మండల సురేందర్, ఉపాధ్యక్షుడు మారోజు రమేష్‌బాబు, నాయకులు రాజు యాదవ్, కార్యదర్శి దుర్గేష్, గాలయ్య, ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు బాచుపల్లి రమేష్ చారి, విశ్వకర్మ హక్కుల సాధన సమితి జవహర్ నగర్ అధ్యక్షుడు రామ్ బ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శి వల్ల యాదగిరి చారి, ముత్తుస్వామి కాలనీ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఆకునూరి నగేష్ చారి, విశ్వకర్మ జేఏసీ సలహాదారులు సదానందం, శివచారి, సుదర్శన్ చారి, బీసీ సంఘం సలహాదారులు ముదిరాజ్ నరసింహ, రమేష్, నరసింహ, సత్యం చారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపునకు ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం

**పెద్దమందడి,ఆగస్టు06(తెలంగాణ ముచ్చట్లు):**




వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, నివాస పాఠశాలల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం గురువారం మండల వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి శ్రీమతి మంజులత అధ్యక్షతన నిర్వహించారు.సమావేశానికి జిల్లా అధికారులు ప్రతాప్ రెడ్డి, శ్రీనివాసులు హాజరై పాఠశాలల్లో అమలు చేస్తున్న పలు విద్యా కార్యక్రమాలపై ప్రధానోపాధ్యాయులకు సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, పరిశోధనాత్మక ఆలోచన, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంపొందించే చర్యలను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి జాతీయ స్థాయి కార్యక్రమాలకు నామినేషన్లు పంపించడం, జాతీయ బాలల విజ్ఞాన సదస్సు నమోదు ప్రక్రియను పూర్తి చేయడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపక కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ విద్యను అందించడం, విజ్ఞానశాలల సద్వినియోగం, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పెంపొందించే ప్రత్యేక కార్యక్రమాల అమలు, బాలబాలికల సమగ్ర అభివృద్ధి, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి తగిన సేవలు అందించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధనలో వినియోగించడం తదితర అంశాలపై అధికారులు విస్తృతంగా చర్చించి పలు సూచనలు చేశారు.ప్రభుత్వం చేపట్టిన ప్రతి విద్యా కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో మండల పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న, ఎస్. వరప్రసాద్ రావు, సమాచార నిర్వహణ సమన్వయకర్త విష్ణు, మండల వనరుల వ్యక్తులు తిరుపతయ్య, సేవ్యతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, నివాస పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ ఉద్యమానికి జయశంకర్, గద్దర్ మార్గదర్శకులు

- **సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్**

**వనపర్తి,ఆగస్టు06(తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ ఉద్యమానికి వెలుగులు నింపిన మహనీయులు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, ప్రజా గాయకుడు గద్దర్ అని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని రేడియంట్ హైస్కూల్ ప్రాంగణంలో సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని తన ఉపన్యాసాలు, రచనల ద్వారా ప్రపంచానికి చాటిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. అట్టడుగు వర్గాల బాధలు, సమస్యలను తన పాటల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కల్పించిన ప్రజా గాయకుడు గద్దర్ అని పేర్కొన్నారు.ఒకరు మాటతో, మరొకరు పాటతో తెలంగాణ ఉద్యమానికి బలమైన స్వరంగా నిలిచి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. వారి ఆశయ సాధన కోసం ప్రజలు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక ప్రతినిధులు కందూరు నారాయణరెడ్డి, జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, సత్తార్, నిరంజనయ్య, బండారు శ్రీనివాస్, దేశి రాములు యాదవ్, గంధం నాగరాజు, పెరుమాళ్ల శ్రీనివాస్, వెంకటయ్య, బొజ్జిబాబు, మద్దిలేటి, కర్నె శివ, డి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో సంకీర్తనకు సీటు

- **విద్యార్థినికి అండగా జక్కని సంజయ్**

**హుజురాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన రానవేణి రాజు కుమార్తె కుమారి సంకీర్తన ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో ప్రవేశానికి సీటు సాధించి ప్రతిభ చాటారు. విజయనగరంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పాల్గొని ప్రవేశాన్ని ఖరారు చేసుకున్న ఆమె విజయంపై గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాసన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు స్వీకరించారు.
తన విద్యా ప్రస్థానంలో అండగా నిలిచిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సంకీర్తన కృతజ్ఞతలు తెలిపారు.
కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందే వరకు అడ్మిషన్ ప్రక్రియలో ప్రతి దశలో స్వంత కుటుంబ సభ్యుడిలా మార్గదర్శనం చేస్తూ సహకరించిన బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సత్యశోధక్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి జక్కని సంజయ్ కుమార్‌కు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
ఈ సందర్భంగా జక్కని సంజయ్ కుమార్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులు చూపిన విద్యా మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. గ్రామీణ, పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను లక్ష్యంగా పెట్టుకుని కృషి చేస్తే దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించగలరని పేర్కొన్నారు.
ప్రతి ప్రతిభావంతుడైన విద్యార్థికి అవసరమైన మార్గదర్శనం, సహకారం అందించడం సమాజ బాధ్యత అని, పేద మరియు గ్రామీణ విద్యార్థులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. సంకీర్తన ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించి కుటుంబానికి, గ్రామానికి, సమాజానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తాం.. బీజేపీ పాలనకు వ్యతిరేకంగా సీపీఐ పాదయాత్ర

**వేలేరు ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు ):**



ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటమే కమ్యూనిస్టుల జీవన విధానమని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిందని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి విమర్శించారు.
బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన సీపీఐ దేశవ్యాప్త పోరు యాత్రలో భాగంగా గురువారం వేలేరు మండలంలోని పలు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. సాధారణ ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడేలా పాలన సాగుతోందన్నారు.
ఆగస్టు 6 నుంచి ప్రారంభమైన ఈ దేశవ్యాప్త పోరు యాత్ర గ్రామీణ, పట్టణ ప్రాంతాల గుండా కొనసాగుతూ అట్టడుగు వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఉద్యమించనుందని తెలిపారు. రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించడంలో విఫలమైందని విమర్శించారు.
మోదీ పాలనలో పెరుగుతున్న నియంతృత్వ ధోరణుల్లో భాగంగా రాజకీయ ప్రత్యర్థులను అణచివేసేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా జరుగుతున్న సీపీఐ పోరు యాత్రను ప్రజలు పెద్ద ఎత్తున ఆదరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్.ఎ. స్టాలిన్, ఉట్కూరి రాములు, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, మాలోతు శంకర్, శనిగరపు రాజ్‌కుమార్, రాసమల్ల దీనా, గుంటి రాజేందర్, ధర్మసాగర్ మండల కార్యదర్శి కొట్టె వెంకటేశ్, మండల నాయకులు సింగారపు కొమురయ్య, బొట్టు బిక్షపతి, కొట్టె లింగయ్య, వల్లపు సారయ్య, బండి రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో మోటివేషనల్ కార్యక్రమం

- **-ఇండక్షన్ ప్రోగ్రాంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన.**
- **-లక్ష్యసాధనకు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసమే విజయానికి మార్గమని సూచన.**

**సత్తుపల్లి, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**




మండలంలోని సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్, డిప్లొమా, బి.ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం మోటివేషనల్ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్, యోగా ప్రాక్టీషనర్ కె.ఎస్.కె. జయదేవ్ రావు ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. లక్ష్యసాధనలో ఎదురయ్యే అడ్డంకులను ధైర్యంగా అధిగమించాలని, సమయాన్ని వృథా చేసే అలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు.
విద్య యొక్క ప్రాముఖ్యత, మానవీయ విలువలు, నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, మైండ్ పవర్, ఆరోగ్యం, తల్లిదండ్రులు, గురువుల గొప్పతనం, వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, నైతిక విలువలు, సేవాభావం వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగితే భవిష్యత్తులో సమాజానికి, దేశానికి ఉపయోగపడే ఆదర్శ పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యుడు, కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ మార్గదర్శకాల మేరకు ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా ఈ మోటివేషనల్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులకు యాజమాన్యం తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ షేక్ మీరాసాహెబ్, వివిధ ఇంజినీరింగ్ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) అధికారి బలుసుపాటి సీతారాములు తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# హుజూరాబాద్‌లో జయశంకర్‌కు నివాళి

- **చైర్‌పర్సన్ సుహాసిని, కమిషనర్ కిషన్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు**

**హుజూరాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య ప్రొఫెసర్ శ్రీ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నివాళుల కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి శ్రీ రొంటాల సుహాసిని మనోజ్‌రావు గారు, మున్సిపల్ కమిషనర్ బి. కిషన్ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు నాయకులు, అధికారులు ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం చేసిన కృషిని స్మరించుకున్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంతపరమైన దిశానిర్దేశం, సమాజంలో చైతన్యం కల్పించడంలో పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, తెలంగాణ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.
జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. తెలంగాణ కోసం ఆయన చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్, కార్యాలయ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ మహనీయుడికి ఘనంగా నివాళులు అర్పించారు.

# అంజనగిరి లక్ష్మీవేంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి

- **విట్టా శశివర్ధన్ రెడ్డి**

**వనపర్తి,ఆగస్టు06( తెలంగాణ ముచ్చట్లు):**



ఖిల్లా ఘనపూర్ మండలంలోని గటుకాడిపల్లి (అంజనగిరి)లో వెలసిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామివారిని నేడు (శుక్రవారం) అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకోవాలని ఆలయ నిర్వాహకులు విట్టా శశివర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు.ఆయన గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ప్రతి నెల 7వ తేదీన నిర్వహించే స్వామివారి ప్రత్యేక దర్శన కార్యక్రమంలో భాగంగా ఈ నెల కూడా శుక్రవారం ఉదయం 9 గంటలలోపు భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. భక్తులు వీలైనంత వరకు సతి సమేతంగా (దంపతులుగా) హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు.అలాగే ప్రతి ఒక్కరూ పంచకట్టుతో, నిర్వాహకులు అందజేసిన కండువా ధరించి కార్యక్రమానికి హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో భజన నిర్వహించనున్నందున భజన బృందాలు కూడా పాల్గొనవచ్చని పేర్కొన్నారు.స్వామివారి దర్శనం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రసాదాన్ని ఖిల్లా ఘన్‌పూర్‌కు చెందిన శ్రీదేవి (మురళి శెట్టి సతీమణి), శ్రీ లక్ష్మీవేంకటేశ్వర రైస్ మిల్స్ ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు వెల్లడించారు.ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్యను మరింత పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను వెంట తీసుకువచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విట్ట శశివర్ధన్ రెడ్డి కోరారు.

# వనపర్తికి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు.. ఐటీఐ హబ్‌కు రూ.241 కోట్లు

**వనపర్తి,ఆగస్టు06(తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రంలో విద్యాపర్తిగా గుర్తింపు పొందిన వనపర్తికి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు దక్కింది. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వనపర్తి ప్రభుత్వ ఐటీఐని హబ్‌గా ఎంపిక చేస్తూ రూ.241 కోట్ల అంచనా వ్యయంతో పనుల కేటాయింపు ప్రక్రియను ప్రారంభించింది.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు జిల్లాకు మంజూరైందని తెలిపారు. ప్రాజెక్టు మంజూరుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ ప్రాజెక్టులో భాగంగా వనపర్తి ఐటీఐ హబ్ ఆధ్వర్యంలో మన్ననూరు, మహబూబ్‌నగర్ బాలికల ఐటీఐ, దిండి, గద్వాల ప్రభుత్వ ఐటీఐలు అనుసంధానమై సమగ్ర నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకోనున్నాయి. అత్యాధునిక ప్రయోగశాలలు, డిజిటల్ తరగతి గదులు, ఆధునిక పరికరాలు, పరిశ్రమలకు అనుగుణమైన కొత్త శిక్షణా కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. అలాగే విద్యార్థులకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పించనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుతో వనపర్తి రాష్ట్రంలోనే ప్రముఖ నైపుణ్య శిక్షణ కేంద్రంగా ఎదగనుందని, గ్రామీణ యువతకు స్థానికంగానే నాణ్యమైన శిక్షణతో పాటు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రూ.241 కోట్ల ఐటీఐ హబ్ ప్రాజెక్టు వనపర్తి అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.





# సహారా డబ్బుల కోసం ఢిల్లీలో మండల బాధితుల ధర్నా

- **మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం**

**భీమదేవరపల్లి,ఆగస్టు 06 (తెలంగాణ ముచ్చట్లు)**

సహారా ఇండియాలో డిపాజిట్ చేసిన తమ సొమ్మును వెంటనే తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి చెందిన సహారా కార్యకర్తలు, బాధితులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన ధర్నా గురువారానికి మూడో రోజుకు చేరింది. "మా డబ్బులు మాకు ఇవ్వాలి" అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ... ఏళ్లకు ఏళ్లు గడుస్తున్నా డిపాజిట్ దారులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో భాగంగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఢిల్లీలో కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఎంపీ ఈటల సానుకూలంగా స్పందిస్తూ, బాధితులకు త్వరలోనే న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో సహారా మేనేజర్ గడల కుమార్, మండ మహేందర్, చిత్రాల మహేష్‌తో పాటు పలువురు బాధితులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాస్తవాలు నిర్ధారించకుండా వార్తలు ప్రచురించడం సరికాదు

- **-తహసీల్దార్ కోమి**

**వేలేరు,ఆగస్టు6(తెలంగాణ ముచ్చట్లు):**



వాస్తవాలను నిర్ధారించకుండా, ఏకపక్ష ఆరోపణల ఆధారంగా వార్తలు ప్రచురించడం బాధ్యతాయుతమైన జర్నలిజానికి విరుద్ధమని వేలేరు తహసీల్దార్ కోమి అన్నారు. ఇటువంటి తప్పుడు కథనాలు వ్యక్తిగత పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించడమే కాకుండా, ప్రభుత్వ అధికారుల విధి నిర్వహణపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన, కృష్ణవేణి ఫిర్యాదుకు సంబంధించిన అంశం ప్రస్తుతం న్యాయపరమైన ప్రక్రియలో ఉందని, సంబంధిత అధికారులు చట్టబద్ధమైన నిబంధనల మేరకే వ్యవహరించారని స్పష్టం చేశారు. పూర్తి వివరాలు తెలుసుకోకుండా, అధికారుల వివరణ తీసుకోకుండానే వార్తలు ప్రచురించడం సమంజసం కాదన్నారు.
వాస్తవాలను పక్కనబెట్టి అసత్య ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అపోహలు ఏర్పడటంతో పాటు, అధికారులపై అనవసరమైన మానసిక ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. మీడియా సంస్థలు వార్తల ప్రచురణలో నిష్పాక్షికత, బాధ్యత పాటిస్తూ వాస్తవాలను నిర్ధారించిన తర్వాతే కథనాలను ప్రచురించాలని సూచించారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా అసత్య కథనాలు ప్రచురించడం కొనసాగితే, సంబంధిత వ్యక్తులు లేదా సంస్థలపై చట్టపరంగా పరువునష్టం దావా వేయడానికి వెనుకాడబోనని తహసీల్దార్ కోమి హెచ్చరించారు.

# జన్మదినాన కేటీఆర్‌ను కలిసిన సర్దార్ రవీందర్ సింగ్

- **ప్రజాసేవే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ప్రజానాయకుడు**

**కరీంనగర్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

జన్మదినం సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కరీంనగర్ యాభై ఎనిమిదవ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు.

కరీంనగర్ నగర అభివృద్ధిలో తనదైన ముద్ర వేసిన సర్దార్ రవీందర్ సింగ్ వరుసగా ఆరు సార్లు కార్పొరేటర్‌గా ప్రజల ఆశీస్సులతో విజయం సాధించారు. మేయర్‌గా పనిచేసిన సమయంలో స్మార్ట్ సిటీ పనులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి విశేష కృషి చేసి ప్రజల ప్రశంసలు అందుకున్నారు.

దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'ఒక్క రూపాయికే అంత్యక్రియలు' కార్యక్రమాన్ని అమలు చేసి వేలాది నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచారు. ఈ సేవా కార్యక్రమానికి గుర్తింపుగా అప్పటి భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు చేతుల మీదుగా జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నారు. అలాగే మేయర్‌గా ఉన్న సమయంలో ఒకే రోజులో వేలాది ఇంటింటికి కేవలం ఒక్క రూపాయికే నల్లా కనెక్షన్లు అందించి ప్రత్యేక గుర్తింపు పొందారు.



విద్యార్థుల కోసం 'సరస్వతి ప్రసాదం' కార్యక్రమం, సమ్మర్ క్యాంపులు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, రక్తదాన, వైద్య శిబిరాలు, అనాథలు, వృద్ధులు, దివ్యాంగులకు చేయూత, ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు సహాయం వంటి అనేక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్నారు.

ఇటీవల ఆరోసారి కార్పొరేటర్‌గా ఎన్నికైన అనంతరం 'చేయూత' పేరుతో సంక్షేమ కార్యక్రమాన్ని ప్రారంభించి, యాభై ఎనిమిదవ డివిజన్‌లో జన్మించే ఆడశిశువుకు రూ.పదివేల నూతపదహారు , మగశిశువుకు రూ.అయిదు వేల నూట పదహారు , ఆడబిడ్డ వివాహానికి రూ.ఇరవై అయిదువేల నూట పదహారు ఆర్థిక సహాయం అందిస్తూ పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

జన్మదినం సందర్భంగా కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్న సర్దార్ రవీందర్ సింగ్, భవిష్యత్తులో కూడా ప్రజాసేవను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని తెలిపారు.

# గద్దర్ గేయాలతో మారుమోగిన అంబేద్కర్ చౌరస్తా

- **గద్దర్ ఆశయాలకు తెలంగాణ సాంస్కృతిక కళాకారుల గేయ నివాళి**

**హుజూరాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజాయుద్ధనౌక, ప్రజాకవి గద్దర్ మూడో వర్ధంతి సందర్భంగా హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా పాటల నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన నాయకులు, కళాకారులు ఆయన ప్రజల కోసం సాగించిన ఉద్యమ జీవితం, సమాన సమాజ నిర్మాణానికి చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.



కార్యక్రమంలో కళాకారులు గద్దర్ రచించిన విప్లవ గేయాలను ఆలపిస్తూ సభకు హాజరైన వారిలో చైతన్యం నింపారు. తెలంగాణ ఉద్యమానికి, అణగారిన వర్గాల హక్కుల సాధనకు గద్దర్ అందించిన స్ఫూర్తిదాయకమైన సేవలను వక్తలు గుర్తు చేశారు. ఆయన పాటలు కేవలం వినోదానికి పరిమితం కాకుండా సామాజిక చైతన్యానికి, ప్రజా ఉద్యమాలకు శక్తినిచ్చే ఆయుధాలుగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రజా సంఘాల జేఏసీ నాయకులు కొలిపాక శంకర్ మాట్లాడుతూ, గద్దర్ ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం యువత ముందుండాలని పిలుపునిచ్చారు. గద్దర్ చూపిన మార్గం ప్రజా ఉద్యమాలకు ఎల్లప్పుడూ దిక్సూచిగా నిలుస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హనుమాన్ దేవస్థానం చైర్మన్ భీమోదు సదానందం, తునికి సమ్మయ్య, వేల్పుల ప్రభాకర్, కుర్ర శ్రీనివాస్ గౌడ్, గంట కొమురయ్య పాల్గొన్నారు. అలాగే తెలంగాణ సాంస్కృతిక కళాకారులు పుల్ల వెంకటస్వామి, రావుల తిరుపతి, రావుల సాయికుమార్, మోరే సంపత్, అందాసి నారాయణ, బోడ వినోద్ తదితరులు గద్దర్ గేయాలను ఆలపించి భావోద్వేగపూర్వకంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు, అభిమానులు గద్దర్ ఆశయాల సాధనకు కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేస్తామని సంకల్పం వ్యక్తం చేశారు. గద్దర్ గేయాలతో మారుమోగిన అంబేద్కర్ చౌరస్తాలో కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో ముగిసింది.

# ప్రభుత్వ పాఠశాల తరగతి గదిలో పాముకాటుతో విద్యార్థి మృతి

- **నారాయణపేట, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

నారాయణపేట జిల్లాలోని మద్దూర్ మండలం ఎక్నాస్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విషాద ఘటన చోటుచేసుకుంది. మూడో తరగతి చదువుతున్న రంజిత్ (8) అనే విద్యార్థి తరగతి గదిలో పాఠాలు వింటుండగా పాము కాటుకు గురై, చికిత్స పొందుతూ మృతి చెందాడు.సమాచారం అందుకున్న ఉపాధ్యాయులు బాలుడిని వెంటనే నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యుల చికిత్స ఫలించక బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.

బాలుడి మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల గేటు వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం జరిగిందని ఆరోపిస్తూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పాఠశాల ఆవరణలో పాములు, విషపురుగులు సంచరించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. విద్యార్థుల భద్రత కోసం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.





# కాంగ్రెస్ సీనియర్ నేత సొల్లు బాబు జన్మదిన వేడుకలు

- **ఆత్మీయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**హుజురాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొల్లు బాబు గారి జన్మదిన వేడుకలు హుజురాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాబు గారి నివాసానికి చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సొల్లు బాబు కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి



చేస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. బాబు గారు మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవ చేసే అవకాశం కలగాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

జన్మదిన వేడుకల సందర్భంగా సొల్లు బాబు గారు తనకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయత తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మొర్తాల సాంబయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పానుగంటి కిరణ్ రెడ్డి, జూపాక సమ్మక్క సారలమ్మ జాతర చైర్మన్ దాసరి సదయ్య, బీసీ సెల్ మాజీ నియోజకవర్గ చైర్మన్ కుర్ర శ్రీనివాస్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంట కొమురయ్య, కందుగుల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉట్ల రత్నాకర్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల

- **పూర్వ విద్యార్థిని విజయగాథతో విద్యార్థినులకు స్ఫూర్తి**

**వరంగల్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా నర్సంపేట సమీపంలోని మూడు చెక్కలపల్లి ప్రభుత్వ ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీఎంఓ ఎం.శ్రీనివాస్, జిల్లా క్రీడల అధికారి బి. దేవీలాల్‌లను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీఎంఓ ఎం. శ్రీనివాస్, ప్రత్యేక అతిథిగా జిల్లా క్రీడల అధికారి బి. దేవీలాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రామయ్య పాల్గొన్నారు.





ఈ సందర్భంగా 2017-18 విద్యా సంవత్సరంలో ఇదే పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని ఎన్ఐటీ భోపాల్‌లో రసాయన శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పరిశోధకురాలిగా ఉన్న ఆంగోత్ మహాలక్ష్మిని ఘనంగా సత్కరించారు.విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడిన ఆంగోత్ మహాలక్ష్మి, చిన్నప్పటి నుంచే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే పట్టుదల, క్రమశిక్షణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మార్గదర్శకత్వాన్ని అనుసరించాలని అన్నారు. తన విజయానికి కారణమైన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏసీఎంఓ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ, మహాలక్ష్మి సాధించిన విజయాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి. రామయ్య, సీనియర్ ఉపాధ్యాయులు గోపాల్, డిప్యూటీ వార్డెన్ స్వరూప, వీరమ్మ, కవిత, పద్మ, శాంతకుమారి, పకీర, హరిచంద్ర, సాంబయ్య, వెంకన్న, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# కరీంనగర్‌లో జనసేన సన్నాహక సమావేశం

- **ఆగస్టు 9న ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని నాయకుల పిలుపు**

**కరీంనగర్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం విజయవంతానికి పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని జనసేన నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్ వెంకటేశ్వర కాలనీలోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా జనసేన పార్టీ నాయకుడు కందుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు ఇరవైఅయిదు మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఈ నెల తొమ్మిది న కరీంనగర్‌లోని వాసర గార్డెన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జనసేన పార్టీ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశానికి జనసేన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ తల్లూరి, తెలంగాణ ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్‌తో పాటు పలువురు రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశ ఏర్పాట్లపై నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నలుమూలల నుంచి జనసేన శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# పూలే కమిటీ ఆధ్వర్యంలో జయంతి

- **తెలంగాణకు జయశంకర్ మార్గదర్శి**

**హుజురాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు ):** మహాత్మ జ్యోతిబా పూలే కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ తొంబైరెండవ జయంతి వేడుకలను హుజురాబాద్ అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిబా పూలే కమిటీ గౌరవాధ్యక్షుడు జనార్ధన్, అధ్యక్షుడు సందేల వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తొలి దశ ఉద్యమానికి పునాదులు వేసి, మలిదశ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన "నీళ్లు-నిధులు-నియామకాలు" అనే సిద్ధాంతమే తెలంగాణ ఉద్యమానికి మూల స్ఫూర్తిగా నిలిచి ప్రత్యేక రాష్ట్ర సాధనకు దోహదపడిందని పేర్కొన్నారు.

జయశంకర్ ఆశయాలకు ఆకర్షితులై వేలాది మంది ఉద్యమంలో పాల్గొనడంతో పాటు అనేక మంది యువకులు తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా పాలించడం ప్రభుత్వ బాధ్యత అని, నీళ్లు, నిధులు, నియామకాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పూలే కమిటీ అధ్యక్షుడు చల్లూరి రఘుచారి, ప్రధాన కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్, ఇప్పకాయల సాగర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గ మహిళా జనరల్ సెక్రటరీ దేవసాని ప్రియదర్శిని, ఎస్. సృజన, కొలిపాక క్రాంతికుమార్, సొల్లు శంకర్, తిప్పారపు భువనచంద్ర, కాలేశ్వరం సాల్మన్, పోతారం అశోక్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# తెలంగాణ భావజాలానికి చిరునామా జయశంకర్: మొలుగు ప్రశాంత్ కుమార్

- **జమ్మికుంట టౌన్, ఆగస్టు 06 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సిద్ధాంతపరమైన పునాది వేసి, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నంతా అంకితం చేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సేవలు చిరస్మరణీయమని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అన్నారు.

జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పుట్టుక నీది... చావు నీది... బతుకంతా తెలంగాణది" అనే సిద్ధాంతాన్ని తన జీవితమంతా ఆచరణలో పెట్టిన మహనీయుడు జయశంకర్ సార్ అని కొనియాడారు.

తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేసి, ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని పేర్కొన్నారు. ఉద్యమ సారథి కేసీఆర్‌కు గురుతుల్యులైన ఆయన తెలంగాణ భావజాలాన్ని ప్రతి ఇంటికీ చేర్చారని అన్నారు.

తెలంగాణ చరిత్రలో ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ భూపాలపల్లి జిల్లాకు, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం సముచిత గౌరవం ఇచ్చిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం - 7- ఆగస్టు 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రతి గడపకు సంక్షేమం చేరవేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: వొడితల ప్రణవ్

- **ఇల్లందకుంట మండలంలో రూ.8 లక్షల విలువైన 24 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ – లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి అందజేత**

**ఇల్లందకుంట, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**





ప్రజలకు ఉపయోగపడే సీఎంఆర్ఎఫ్ చెక్కులను వేగంగా అందజేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన ద్వారా ప్రతి గడపకు సంక్షేమాన్ని, ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలను చేరవేస్తోందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు.

గురువారం ఇల్లందకుంట మండలంలోని ఇల్లందకుంట, చిన్న కోమటిపల్లి, టేకుర్తి, బూజునూరు, రాచపల్లి, మల్లన్నపల్లి, శ్రీరాములపల్లి, కనగర్తి, లక్ష్మాజీపల్లి, మల్యాల, వాగొడ్డు రామన్నపల్లి తదితర గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా దాదాపు రూ.8 లక్షల విలువైన 24 సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాలు, పట్టణాల్లో పర్యటించే సమయంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించినట్లు చెప్పారు.

ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా శ్రీరాములపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట దేవాలయ చైర్మన్ రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, జిల్లా అధికార ప్రతినిధులు, వివిధ సంస్థల డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ అభివృద్ధిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సమీక్ష

- **ఈఇసుక, యూరియా, సాగునీరు సమస్యలపై అధికారులకు ఎమ్మెల్యే కీలక ఆదేశాలు**

**హుజురాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**




హుజురాబాద్ మండల అభివృద్ధిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. గురువారం హుజురాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులతో సమావేశం నిర్వహించి మండలంలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్షించారు.

వ్యవసాయం, హార్టికల్చర్, మిషన్ భగీరథ, విద్య, వైద్యం, నీటిపారుదల, విద్యుత్, రెవెన్యూ, ఉపాధి హామీ, అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ఇసుక కొరతపై ఆగ్రహం**

మండలంలో ఇసుక కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే ఆర్డీఓ అధికారితో మాట్లాడారు. స్థానిక అవసరాల కోసం నియోజకవర్గంలోని ఐదు మండలాలు, రెండు పట్టణాల పరిధిలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ విధానంలో రెండు నిమిషాలు కూడా అవకాశం దొరకడం లేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. రూ. పదిహేను వందలకు లభించాల్సిన ఇసుక రూ.ఏడువేల అయిదు వందలు వరకు అధిక ధరలకు విక్రయించడం బాధాకరమన్నారు. యాప్ ద్వారా కాకుండా షాపుల వద్దనే యూరియా ఇవ్వాలి రైతులకు యూరియా అందించడంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. యాప్ ద్వారా కాకుండా నేరుగా షాపుల వద్దనే యూరియా అందించే విధానం అమలు చేయాలని సూచించారు. అవసరమైన సమయంలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టులను నింపాలి కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టులను నింపి హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నీటి ఎత్తిపోతల విషయంలో ఇబ్బందులు వస్తే ఇరవై తొమ్మిది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలం రాజీనామాకు సిద్ధమని తెలిపారు.

విద్యుత్ సరఫరాపై ప్రశ్నలు

ప్రభుత్వం ఇరవైనాలుగు గంటల విద్యుత్ అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పన్నెండు గంటలే సరఫరా అవుతోందని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. రైతులు, ప్రజలకు నిరంతర విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలపై దృష్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ , ఎంపీడీఓ, ఎంఆర్ఓ , వివిధ శాఖల అధికారులు, మండల సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రజల సంరక్షణే ధ్యేయంగా రాత్రింబవళ్లు కృషి చేస్తున్న మున్సిపల్ చైర్మన్

- **ఫ్లైఓవర్ కింద గుంతల పూడ్చివేత పనులను స్వయంగా పర్యవేక్షించిన మొలుగు ప్రశాంత్ కుమార్**

**జమ్మికుంట టౌన్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**





ప్రజలకు సురక్షితమైన ప్రయాణం కల్పించడమే లక్ష్యంగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) గురువారం రాత్రి స్వయంగా రోడ్డెక్కి గుంతల పూడ్చివేత పనులను పర్యవేక్షించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులపై వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆయన ప్రత్యేక చొరవతో మరమ్మతు పనులను వేగవంతం చేశారు.

జమ్మికుంట పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ఫ్లైఓవర్ కింద రహదారిపై ఏర్పడిన గుంతలను మున్సిపల్ సిబ్బందితో కలిసి రాత్రి వేళల్లోనే పూడ్చివేయించారు. పగటి సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా, వాహనాల రాకపోకలు తగ్గిన తర్వాత పనులు చేపట్టడం విశేషంగా నిలిచింది. పనులు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి ప్రతి అంశాన్ని స్వయంగా పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రజల భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా దెబ్బతిన్న రహదారులను దశలవారీగా మరమ్మతు చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో రహదారుల పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, ఎక్కడ సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేలా మున్సిపల్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టడంలో మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని, పట్టణంలో సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ కోసం నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ

# అభివృద్ధే అజెండా.. శాఖల వారీగా అధికారులకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దిశానిర్దేశం

- *** మండల ప్రజా పరిషత్ సమావేశంలో సమగ్ర సమీక్ష – ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం**

**వీణవంక, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

వీణవంక మండల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశంలో పాల్గొన్న ఆయన, వివిధ శాఖల అధికారులతో శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించి అభివృద్ధి పనుల పురోగతిని నిశితంగా పరిశీలించారు.

వ్యవసాయం, హార్టికల్చర్, మిషన్ భగీరథ, విద్య, వైద్యం, నీటిపారుదల, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, గ్రామీణ రహదారుల అభివృద్ధి తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. గ్రామాల్లో తలెత్తుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావు లేకుండా నిర్ణీత గడువులోనే పనులు పూర్తి చేయాలని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరుతాయని ఆయన పేర్కొన్నారు.




# వివేకానంద విగ్రహం తొలగింపు అవసరం లేదు: హైకోర్టు

- *** దేవాలయ ఉత్సవాలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 06 (తెలంగాణ ముచ్చట్లు):**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయ భూమిలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని తొలగించాల్సిన అవసరం లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే దేవాలయ రథోత్సవాలు, ఇతర ఉత్సవాలు, భక్తుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

దేవాలయ వ్యవస్థాపక ట్రస్టీ కొండూరు రాజ్‌కుమార్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సుద్దాల చలపతి రావు విచారణ చేపట్టారు. దేవాలయ భూమిలో వివేకానంద విగ్రహం ఏర్పాటు చేయడం వల్ల రథోత్సవాలకు అంతరాయం కలుగుతోందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

అయితే మున్సిపాలిటీ తరఫు న్యాయవాది, విగ్రహాన్ని రోడ్ల కూడలిలోని ఐలాండ్‌పై ఏర్పాటు చేసినట్లు, దేవాలయ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు, సమర్పించిన పత్రాలు, ఫొటోలను పరిశీలించిన హైకోర్టు రథోత్సవాల సమయంలో అవసరమైతే ట్రాఫిక్‌ను నియంత్రించాలని, రహదారులను తాత్కాలికంగా మూసివేయాలని, కూరగాయల మార్కెట్‌ను తాత్కాలికంగా వేరే ప్రాంతానికి తరలించాలని అధికారులను ఆదేశించింది. దీంతో రథోత్సవాలు, భక్తుల రాకపోకలు ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.

అదేవిధంగా, స్వామి వివేకానంద జయంతి వంటి ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే విగ్రహం వద్ద నివాళుల కార్యక్రమాలు నిర్వహించాలని, ఇతర సమయాల్లో అక్కడ జనసమూహం ఏర్పడి ప్రజలకు లేదా దేవాలయ కార్యక్రమాలకు ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు రిట్ పిటిషన్‌ను ముగిస్తూ, ఎటువంటి కోర్టు ఖర్చులు విధించకుండా ఉత్తర్వులు జారీ చేసింది.



# రోడ్డు ప్రమాద బాధిత చిన్నారికి అండగా సబ్బాని వెంకట్

- *** ఆస్పత్రిలో పరామర్శ.. రక్తదానం సమన్వయం, 50 కిలోల బియ్యం అందజేత**

**జమ్మికుంట , ఆగస్టు 06 (తెలంగాణ ముచ్చట్లు):**

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకుడు కొయ్యడ మధు కుమార్తె అక్షర (8) ను సామాజికవేత్త సబ్బాని వెంకట్ బుధవారం పరామర్శించారు.

హస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండలానికి చెందిన అక్షర ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రమాదంలో చిన్నారికి కుడి చేయి, కుడి కాలు విరగడంతో ఇప్పటికే ఒక శస్త్రచికిత్స నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఈ సందర్భంగా సబ్బాని వెంకట్ ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులను కలిసి చిన్నారికి అత్యుత్తమ వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. చికిత్సకు అవసరమైన బినెగెటివ్ రక్తాన్ని అందించేందుకు రక్తదాతలను సమన్వయం చేసి రక్తదానం జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

అంతేకాకుండా బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. చిన్నారి పూర్తి ఆరోగ్యంతో కోలుకునే వరకు అవసరమైన వైద్య సహాయం, ఇతర అవసరాల కోసం తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సబ్బాని వెంకట్ అందించిన ఆర్థిక, మానవతా సహాయానికి కొయ్యడ మధు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# గోపాలపురం ప్రభుత్వ పాఠశాలకు రూ.25 లక్షలు మంజూరు

**ఖమ్మం, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గదుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. పాఠశాల దుస్థితిపై ఒక పత్రికలో ప్రచురితమైన కథనానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పాఠశాలను తక్షణమే సందర్శించి అవసరమైన వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్‌కు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్ పాఠశాల ఉపాధ్యాయిని ఇందిరతో ఫోన్‌లో మాట్లాడి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ గురువారం పాఠశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధి కోసం చొరవ చూపిన ఉపాధ్యాయిని నిమ్మతోట ఇందిరను అభినందించారు. అనంతరం పాఠశాలలో కొత్త గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి, వెంటనే నిధులు విడుదల చేశారు.



# పల్లవి ఇంజినీరింగ్ కళాశాలలో నూతన విద్యార్థుల కోసం ఓరియంటేషన్ ప్రోగ్రాం




**హైదరాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

కుంట్లూరులోని పల్లవి ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో 2026-27 విద్యా సంవత్సరానికి కొత్తగా ప్రవేశం పొందిన బీటెక్ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీపప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమై, ప్రార్థనా గీతం, విద్యార్థుల సాంప్రదాయ, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బి. రాజు మాట్లాడుతూ, ఏఐసీటీఈ, జేఎన్‌టీయూహెచ్ మార్గదర్శకాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య, ఆధునిక ప్రయోగశాలలు, సాంకేతిక సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, సమగ్ర అభివృద్ధిపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ఉపాధ్యాయులతో సంప్రదింపులు జరపాలని సూచించారు.

కళాశాల చైర్మన్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలకు అనుగుణంగా విద్యా సంస్కరణలను అమలు చేస్తూ, దేశాభివృద్ధికి తోడ్పడే బాధ్యతాయుత ఇంజినీర్లను తీర్చిదిద్దడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.ముఖ్య అతిథి, సత్యం కంప్యూటర్ సర్వీసెస్ మాజీ తాత్కాలిక సీఈఓ ఏ.ఎస్. మూర్తి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని దశలవారీ కార్యాచరణగా అమలు చేయాలని సూచించారు. ఆత్మవిశ్వాసం, బాధ్యత, ఏకాగ్రత, సమర్థవంతమైన సంభాషణ, నిరంతర అభ్యాసం విజయానికి కీలకమని తెలిపారు.

అకడమిక్ సలహాదారు ప్రొఫెసర్ ఎస్.జి.ఎస్. మూర్తి మాట్లాడుతూ, ఇంజినీరింగ్ మౌలిక అంశాలపై పట్టు సాధించి, తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని ప్రయోగశాలలు, ప్రాజెక్టులు, వాస్తవ సమస్యల పరిష్కారంలో వినియోగించాలని సూచించారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీసి వికసింపజేయడమే పల్లవి సంస్థ ధ్యేయమని తెలిపారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మల్క నవీన్ కుమార్ మాట్లాడుతూ, మొదటి సంవత్సరం నుంచే పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు.

క్రిటికల్ రివర్ సంస్థ గ్లోబల్ టాలెంట్ అక్విజిషన్ విభాగం సీనియర్ డైరెక్టర్ దేవవరం సోలమన్ మాట్లాడుతూ, విద్యా ప్రతిభతో పాటు ఆలోచనా విధానం, నేర్చుకునే తత్వం, వృత్తి నైపుణ్యాలు, కమ్యూనికేషన్, సమయపాలన, నిజాయితీ వంటి లక్షణాలకు సంస్థలు అధిక ప్రాధాన్యం ఇస్తాయని తెలిపారు.

క్యాపిటెక్ సొల్యూషన్స్ డైరెక్టర్ గణేష్ సోమిశెట్టి మాట్లాడుతూ, కార్పొరేట్ రంగంలో జట్టు భావన, విశ్లేషణ, నిర్ణయ సామర్థ్యం, బాధ్యతాయుత వైఖరి, నాయకత్వ లక్షణాలు అత్యంత కీలకమని చెప్పారు.

కళాశాల డైరెక్టర్ డాక్టర్ జె.బి.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, పరిశోధనా దృక్పథం, సామాజిక బాధ్యతతో స్థానిక సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అందించేలా విద్యార్థులు ప్రాజెక్టులు చేపట్టాలని సూచించారు. ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొని సమగ్ర అభివృద్ధి సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ విద్యార్థులు తమ విద్యాభ్యాసం, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలపై అనుభవాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి బెరెల్లి కమలాకర్ రావు, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఆర్. ఉదయ్ కుమార్, పరిపాలనాధికారి ఏ. శ్రీధర్, ప్లేస్‌మెంట్ అధికారి మారుతి రాజు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, సీనియర్ విద్యార్థులు, నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రామడుగు మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై విస్తృత చర్చ

**రామడుగు, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**




రామడుగు మండలంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారి ఎం. అనిల్ ప్రకాష్ కిరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సమావేశానికి ముందు మండలంలోని సర్పంచులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉండాలని, మిగతా సమయంలో ప్రజాసేవే లక్ష్యంగా అందరూ పనిచేయాలని అన్నారు. పార్టీలకు, వర్గాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

రెవెన్యూ, మండల పరిషత్, విద్యుత్, వ్యవసాయం, విద్య, వైద్యం తదితర శాఖల పనితీరు, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని, ప్రాధాన్యత ఆధారంగా నిధులు మంజూరు చేయించుకుని పనులు చేపట్టాలని సూచించారు. అన్ని గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు కనీస మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించాలని ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో ఆర్డీఓ షర్మిల, డిప్యూటీ ఈఈ ఏ. రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీవో రాజేశ్వరి, తహసీల్దార్ రాజమల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బొమ్మర వేణి తిరుమల, ఎస్సై రాజు, సర్పంచులు రాజేష్ కన్నా, నరసింగరావు, అంజన్ కుమార్, మొయిజ్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి,సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- రైతు భీమా పత్రాలు అందజేత

**రామడుగు, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**



చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నివాళులర్పించారు. అనంతరం మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు పంపిణీ చేయడంతో పాటు ప్రమాదవశాత్తు మరణించిన రైతుల కుటుంబాలకు రూ.5 లక్షల రైతు భీమా ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.9,33,200 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సుమారు రూ.10,01,160 విలువైన చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. పేద ప్రజలకు కష్టకాలంలో అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పారదర్శకంగా, వేగవంతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వంపై నమ్మకంతో దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి సీఎంఆర్ఎఫ్ సహాయం అందేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని, సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, తహసీల్దార్ రాజమల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, డిప్యూటీ తహసీల్దార్ అరుణ్ కుమార్, ఆర్ఐ కమలేశ్వర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోల రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం, ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# వీరశైవ జంగమ అర్చకుల ఐక్య వేదికకు నూతన నాయకత్వం

- -రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సదానిరంజన్ సిద్ధాంతి ఏకగ్రీవ ఎన్నిక

**ఎల్కతుర్తి, ఆగస్టు 6( తెలంగాణ ముచ్చట్లు):**



యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాకలో తెలంగాణ వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చకుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 300 మంది అర్చకులు హాజరై అర్చకుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ధూప దీప నైవేద్య అర్చకులకు అందాల్సిన సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రభుత్వ గుర్తింపు, ఆరోగ్య బీమా, పింఛన్, గౌరవ వేతనం, సామాజిక భద్రతతో పాటు దేవాలయాల్లో సేవల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, అర్చకుల ఆర్థిక పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చకులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘటిత శక్తిగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అర్చకుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో కార్యాచరణ రూపొందించాలని, అవసరమైతే వినతిపత్రాలు సమర్పించడం, ఉద్యమ కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా తెలంగాణ వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చక సంఘం అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా గౌంగళ్ళ మఠం రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సదానిరంజన్ సిద్ధాంతి, రాష్ట్ర కోశాధికారిగా విభూది ప్రభులింగం ఎన్నికయ్యారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్రంలోని అర్చకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అర్చకుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల సాధన కోసం నిబద్ధతతో పనిచేస్తానని, రాష్ట్రంలోని ప్రతి అర్చకుడిని సంఘటితం చేసి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న అర్చకులు సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేసి రాష్ట్రవ్యాప్తంగా అర్చకుల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తూ ధూప దీప నైవేద్య అర్చకుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తామని వెల్లడించారు.



# సామాజిక న్యాయమే లక్ష్యం.. సంకల్ప సభలో అంబాల హరీష్

- **జమ్మికుంట టౌన్, ఆగస్టు 06 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో గురువారం నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో తెలంగాణ రక్షక సేన కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల అధ్యక్షుడు అంబాల హరీష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సభలో పలువురు నాయకులు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, తెలంగాణ ఆశయాల పరిరక్షణపై ప్రసంగించారు. అనంతరం అంబాల హరీష్ మాట్లాడుతూ, సామాజిక న్యాయం సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తెలంగాణ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సంకల్ప సభలో తెలంగాణ రక్షక సేన నాయకులు, కార్యకర్తలు, వివిధ జిల్లాల ప్రతినిధులు, సామాజిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలిగా నునావత్ రమాదేవి

**వరంగల్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు, ఏసీఎంఓ వరంగల్, జిల్లా క్రీడల అధికారి ఆధ్వర్యంలో వర్ధన్నపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలిగా నునావత్ రమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా నునావత్ రమాదేవి మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థినులకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థినుల సర్వతోముఖాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని నునావత్ రమాదేవికి శుభాకాంక్షలు తెలిపారు.





# కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పిన సర్పంచ్ గోలిపెల్లి సంపత్

**ఎల్కతుర్తి , ఆగస్టు 6( తెలంగాణ ముచ్చట్లు):**

ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన రేషన్ షాపు డీలర్ మంద సమ్మయ్య మృతి పట్ల సర్పంచ్ గోలిపెల్లి సంపత్ సంతాపం తెలిపారు. గత 30 సంవత్సరాలుగా గ్రామ ప్రజలకు రేషన్ డీలర్‌గా సేవలందించిన సమ్మయ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గురువారం మృతి చెందారు.

విషయం తెలుసుకున్న సర్పంచ్ గోలిపెల్లి సంపత్ సమ్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యం చెప్పారు. గ్రామ ప్రజలకు సుదీర్ఘకాలం సేవలందించిన సమ్మయ్య సేవలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం సమ్మయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొని మంద సమ్మయ్యకు ఘన నివాళులర్పించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ప్రజాకవి గద్దర్‌కు,ఆచార్య జయశంకర్‌కు

# ముఖ్యమంత్రి నివాళి

**హైదరాబాద్,ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాకవి గద్దర్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో గద్దర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అదే విధంగా తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా కూడా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ కీలక సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో రాజేంద్రనగర్ మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని దుర్గా కన్వెన్షన్ హాల్‌లో మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్లమెంట్ ఇన్‌చార్జులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఓటరు నమోదు ప్రాధాన్యతపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని, నమోదు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పార్టీ నాయకులందరూ పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రతి నియోజకవర్గానికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. కార్పొరేషన్ల చైర్మన్లు, అసెంబ్లీ, పార్లమెంట్ ఇన్‌చార్జులు, జిల్లా అధ్యక్షులు బాధ్యత తీసుకుని ప్రతి పట్టభద్రుడిని వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదుకు ప్రోత్సహించాలని చెప్పారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నికల హామీలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించి కాంగ్రెస్ పార్టీకి మద్దతు కూడగట్టాలని మంత్రి పిలుపునిచ్చారు.
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక అభ్యర్థి ఎంపికపై అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం తీసుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, ఇతర ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.





# చెట్లను కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం

- **– పాఠశాల కరస్పాండెంట్ పుష్కరి కార్తీక్ రావు**

**ఎల్కతుర్తి ఆగస్టు 06 (తెలంగాణ ముచ్చట్లు ):**

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హై స్కూల్‌లో గురువారం హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పాఠశాల కరస్పాండెంట్ పుష్కరి కార్తీక్ రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా మొక్కలు నాటగా, పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేసింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పుష్కరి కార్తీక్ రావు మాట్లాడుతూ, చెట్లు మానవ జీవితానికి ప్రాణాధారమని అన్నారు. చెట్లు స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విచ్చలవిడిగా చెట్లను నరికివేయడం వల్ల గ్లోబల్ వార్మింగ్, ఉష్ణోగ్రతల పెరుగుదల, వర్షాభావం, వాతావరణ అసమతుల్యత వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయని విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని సూచించారు. విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణను ఉద్యమంలా కొనసాగించి, పచ్చని తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపాల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు సరిత, లావణ్య, ఆశా బేగం, రమేష్, కృష్ణ, లలిత, సుమలత, కవిత, గీత, స్వప్న, కావ్య, రమ్య, రక్షణ తదితరులు పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**వేలేరు ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు ):**

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా వేలేరు మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కోమి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అధికారులు, సిబ్బంది తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ ఆవిర్భావానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.



## పార్కిన్సన్స్ బాధితుడికి రూ.7.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు

**2సిరిసిల్ల, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

సిరిసిల్ల పట్టణంలోని ముష్టిపల్లికి చెందిన జడల సునీల్ కుమార్ పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతూ అత్యవసర చికిత్స అవసరమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించి వైద్య సహాయం అందించారు.
నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి బాధితుడికి ప్రత్యేక వైద్యం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.7.50 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) మంజూరు చేయించారు.సమయానికి వైద్య సహాయం అందడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- **పెద్దమందడి తహసిల్దార్ మల్లికార్జున్**

**పెద్దమందడి,ఆగస్టు06(తెలంగాణ ముచ్చట్లు):**




ప్రత్యేక తెలంగాణ సాధనలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని వనపర్తి జిల్లా పెద్దమందడి తహసిల్దార్ మల్లికార్జున్ కొనియాడారు.ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం పెద్దమందడి తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో తహసిల్దార్ మల్లికార్జున్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం చేసిన కృషి భావితరాలకు ఆదర్శప్రాయమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన చేసిన ఉద్యమం, త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని తాసిల్దార్ మల్లికార్జున్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ గౌస్, రెవెన్యూ సిబ్బంది, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హిరోషిమా దినోత్సవం సందర్భంగా శాంతి సెమినార్

**ధర్మసాగర్, ఆగస్టు 6 (తెలంగాణ ముచ్చట్లు):**

హిరోషిమా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మసాగర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ సహకారంతో ప్రధానోపాధ్యాయులు కె.బి. ధర్మప్రకాశ్ అధ్యక్షతన శాంతి సెమినార్ నిర్వహించారు.
కార్యక్రమానికి ముందు ఎం. రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి శాంతి ర్యాలీ నిర్వహించి ప్రపంచ శాంతి సందేశాన్ని ప్రజలకు చాటిచెప్పారు.

సెమినార్‌లో ప్రధానోపాధ్యాయులు కె.బి. ధర్మప్రకాశ్ మాట్లాడుతూ యుద్ధాలు, ముఖ్యంగా అణ్వాయుధాలు మానవాళికి తీవ్ర వినాశనాన్ని మిగులుస్తాయని అన్నారు. శాస్త్ర విజ్ఞానం మానవ సంక్షేమం, అభివృద్ధికి ఉపయోగపడాలే గానీ విధ్వంసానికి కాదని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, అణ్వాయుధ నిరాయుధీకరణ, శాస్త్రీయ దృక్పథం నేటి సమాజానికి అత్యంత అవసరమని వివరించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు హిరోషిమా దినోత్సవ ప్రాముఖ్యత, ప్రపంచ శాంతి, శాస్త్రీయ పరిశోధనల ద్వారా స్వావలంబన సాధనపై ప్రసంగించారు. ఉపాధ్యాయులు పద్మజ, కిరణ్మయి ప్రపంచ శాంతి, మానవతా విలువలపై అవగాహన కల్పించారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ప్రపంచ శాంతి కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in